## రవితేజ సోషియో ఫాంటసీ చిత్రం



ప్రస్తుతం రవితేజ 'మాస్ జాతర' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్నది. ఈ సినిమా తర్వాత రవితేజ సినిమా ఏంటన్నది ఆసక్తికరంగా మారింది. తాజాగా ఈ విషయంలో కొత్త అప్‌డేట్‌ను అందించారు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత, నిర్మాత సూర్యదేవర నాగవంశీ. 'మాస్ జాతర' పూర్తయ్యాక రవితేజతో తమ సంస్థ మరో సినిమా కూడా నిర్మిస్తుందని, అది సోషియో ఫాంటసీ జోనర్‌లో ఉంటుందని ఆయన వెల్లడించారు. దీంతో రవితేజ మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతున్నారని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక 'మాస్ జాతర' చిత్రం మే 9న విడుదలకానుంది. అయితే ఈ విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ సినిమా రిలీజ్ కొంచెం ఆలస్యం కానుందనే వార్తలు వినిపిస్తున్నాయి.



## కల్యాణ్‌రామ్ మాస్ పాట

కల్యాణ్‌రామ్ నటిస్తున్న తాజా చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. విజయశాంతి కీలక పాత్రను పోషిస్తున్నది. ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మ్యూజిక్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టారు. ఈ నెల 31న 'నాయాల్ది' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా పాట తాలూకు పోస్టర్‌ను విడుదల చేశారు. ఉత్సవం నేపథ్యంలో సాగే మాస్ పాట ఇదని, కల్యాణ్‌రామ్ నృత్యాలు, అజనీష్‌లోక్‌నాథ్ సంగీతం హైలైట్‌గా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. సాయిమంజ్రేకర్, సోహైల్‌ఖాన్, శ్రీకాంత్, పృథ్వీరాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, రచన-దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి.

## ఖమ్మంలో వీరమల్లు విన్యాసాలు



పవన్‌కల్యాణ్ కెరీర్‌లో తొలి ఫోక్‌లర్ మూవీ 'హరి హర వీరమల్లు'. ఇందులో ఆయన రాబిన్‌హుడ్ తరహా పాత్ర పోషిస్తున్నారు. ఉన్నవాళ్లను కొట్టి.. లేనివాళ్లకు పెట్టే ధీరోదాత్తుడిగా ఇందులో పవన్‌కల్యాణ్ కనిపిస్తారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ పానిండియా ప్రాజెక్ట్‌లోని కొంత భాగాన్ని క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి ఈ సినిమాకు దర్శకుడు జ్యోతికృష్ణ. ఏళ్ల తరబడి చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం ఎప్పుడెప్పుడు పూర్తవుతుందా? ఎప్పుడు విడుదల అవుతుందా? అని పవన్ అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. నిజానికి ఈ సినిమా ఈ నెల 28నే విడుదల కావాలి. కానీ షూటింగ్ ఆలస్యం వల్ల రిలీజ్ డేట్‌ని మే 9కి వాయిదా వేశారు. ఇదిలావుంటే.. ఈ సినిమా చివరి షెడ్యూల్ ఖమ్మంలో ప్రారంభమైనట్టు చిత్రవర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఈ షూటింగ్‌లో పవన్ పాల్గొంటారా లేదా అనేది తెలియాల్సివుంది. ఈ షెడ్యూల్‌తోనే షూటింగ్ పూర్తి కానున్నదట. దీంతో పోస్ట్‌ప్రొడక్షన్ పనులను కూడా వేగవంతం చేశారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీడియోల్, నోరా ఫతేహి, అనసూయ భరద్వాజ్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి. మెగా సూర్యమూవీస్ నిర్మాణంలో ఈ సినిమా రూపొందుతున్నది.

## నచ్చినట్టు బతకడమే సక్సెస్



సమంత ప్రస్తుతం సిడ్నీ పర్యటనలో ఉన్నారు. అక్కడ జరిగిన ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెరీర్ గురించి, సక్సెస్ గురించి సమంత ఆసక్తికరంగా మాట్లాడారు. 'ఒడిదుడుకుల నడుమ కెరీర్‌ను సాగించడం.. విజయం సాధించడం.. ఈ పరిణామాన్ని నేనేం గొప్పగా భావించను. సామాజిక పట్టింపులు, కట్టుబాట్ల నుంచి విముక్తి పొందడమే ఒక స్త్రీ నిజమైన విజయం. నచ్చినట్టు బతకడం సక్సెస్. అభిరుచికి తగ్గట్టు పనులు చేయడం సక్సెస్. నిజజీవితంలో పోషించే ప్రతి పాత్రనూ సమర్థవంతంగా రాణించగలగడమే సక్సెస్. ఆ విషయంలో ఒక స్త్రీగా నన్ను చూసుకొని నేను గర్విస్తా. ఇక కెరీర్ పరంగా నేనేంటో అందరికీ తెలుసు. కానీ ఒక్క నటిగా మాత్రమే మిగిలిపోకూడదనే నిర్మాణ సంస్థ మొదలుపెట్టా. వినూత్నమైన కథలను, కొత్త టాలెంట్‌ను సమాజానికి అందించాలనే దృక్పథంతోనే నిర్మాతగా మారాను.' అని తెలిపారు సమంత. ఈ పర్యటనలోనే అక్కడి యువతతో ఆమె మాట్లాడుతూ 'చదువుకునే రోజుల్లో ఆస్ట్రేలియా వెళ్లాలని కలలు కనేదాన్ని. సిడ్నీ యూనివర్సిటీలో చదువుకోవాలని ఆశపడేదాన్ని. కానీ ఆ ఒక్క కోరిక అప్పుడు తీరలేదు. ఇదిగో.. ఇప్పుడు ఇలా తీర్చాడు దేవుడు.' అంటూ అందంగా నవ్వేశారు సమంత.



## నవ్వించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం

''మ్యాడ్‌స్కేర్' చిత్రానికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అద్భుతమైన స్పందన లభిస్తున్నది. అన్ని కేంద్రాల్లో షోలు హౌజ్‌ఫుల్ అవుతున్నాయి. నవ్వించడమే లక్ష్యంగా ఈ సినిమా తీశాం. ఆ విషయంలో మేము సక్సెస్ అయ్యామని భావిస్తున్నాం' అన్నారు చిత్ర సమర్పకులు సూర్యదేవర నాగవంశీ. 'మ్యాడ్ స్కేర్' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ప్రధాన పాత్రల్ని పోషించిన ఈ చిత్రానికి కల్యాణ్‌శంకర్ దర్శకత్వం వహించారు. హారిక సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. కాలేజీ స్టూడెంట్స్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా సినిమాను ఆదరిస్తున్నారని నిర్మాత హారిక సూర్యదేవర ఆనందం వ్యక్తం చేశారు. 'మ్యాడ్'కు సీక్వెల్ కాబట్టి తొలిభాగంతో పోల్చుకుంటారనే టెన్షన్‌తో థియేటర్‌కు వెళ్లామని, ప్రేక్షకుల రెస్పాన్స్ చూశాక సినిమా విషయంలో తమ అంచనాలన్నీ నిజమయ్యాయనే భావన కలిగిందని దర్శకుడు కల్యాణ్‌శంకర్ అన్నారు. థియేటర్లలో ప్రేక్షకుల ఎంజాయ్‌మెంట్ చూస్తుంటే మాటల్లో చెప్పలేనంత ఆనందం కలిగిందని చిత్ర హీరోలు తెలిపారు.

## ప్రతి షోకి వసూళ్లు పెరుగుతున్నాయి



'శుక్రవారం విడుదలైన మా 'రాబిన్‌హుడ్' సినిమాను ఆడియన్స్ బాగా రిసీవ్ చేసుకున్నారు. క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్, ట్విస్ట్‌ల గురించి మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు సినిమా బాగా నచ్చింది. నితిన్ పర్‌ఫార్మెన్స్, రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్‌ల కామెడీ సినిమాకు హైలైట్స్. ఇక వార్నర్ క్యామియోకి అయితే అదిరిపోయే స్పందన వస్తున్నది. ఇది ఫ్యామిలీ అందరికీ నచ్చే సినిమా.' అని దర్శకుడు వెంకీ కుడుముల అన్నారు. ఆయన దర్శకత్వంలో నితిన్ హీరోగా రూపొందిన 'రాబిన్‌హుడ్' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సినిమా గురించి దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడారు. థియేటర్లలో అందరూ ఎంజాయ్ చేసే క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇదని, ప్రతి షోకి వసూళ్లు పెరుగుతున్నాయని నిర్మాతల్లో ఒకరైన వై.రవిశంకర్ తెలిపారు. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై ఈ సినిమా రూపొందిన విషయం తెలిసిందే.

## దర్శకుడిగా హృతిక్‌రోషన్



బాలీవుడ్‌లో యాక్షన్, రొమాంటిక్ చిత్రాల కథానాయకుడిగా హృతిక్‌రోషన్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ముఖ్యంగా 'క్రిష్' సిరీస్ చిత్రాలు ఆయనకు తిరుగులేని ఫాలోయింగ్‌ను తెచ్చిపెట్టాయి. ఈ ఫ్రాంచైజీలో వచ్చిన మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించాయి. దీంతో నాలుగోభాగం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'క్రిష్-4' అనౌన్స్‌మెంట్ త్వరలో ఉంటుందని బాలీవుడ్ మీడియాలో కూడా వార్తలొచ్చాయి. తాజాగా ఈ సినిమా తాలూకు అప్‌డేట్‌ను అందించారు హృతిక్‌రోషన్ తండ్రి, దర్శకుడు రాకేష్ రోషన్. 'క్రిష్-4'కు హృతిక్‌రోషన్ దర్శకత్వం వహిస్తారని ఆయన ప్రకటించారు. '25 ఏళ్ల క్రితం నిన్ను హీరోగా పరిచయం చేశా. ఇప్పుడు దర్శకుడిగా అవకాశమిస్తున్నా. 'క్రిష్' వంటి పాపులర్ సిరీస్‌తో నువ్వు దర్శకుడిగా ఇంట్రడ్యూస్ కావడం ఆనందంగా ఉంది. ఈ కొత్త ప్రయాణంలో నీకు అన్నీ విజయాలు దక్కాలని కోరుకుంటున్నా' అని రాకేష్‌రోషన్ తన సోషల్‌మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. దాదాపు 700కోట్ల భారీ బడ్జెట్‌తో నాలుగో భాగానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. 'క్రిష్' సిరీస్‌లో మూడు చిత్రాలకు రాకేష్ రోషన్ దర్శకత్వం వహించారు. దీంతో నాలుగు భాగాన్ని కూడా ఆయన డైరెక్ట్ చేస్తారని వార్తలు వినిపించాయి. రాకేష్ రోషన్ తాజా ప్రకటనతో 'క్రిష్-4'పై స్పష్టత వచ్చిందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నువ్వే నా ప్రపంచం



అచ్చ తెలుగందం శ్రీలీల పేరు ఇప్పుడు హిందీ చిత్రసీమలో హాట్‌టాపిక్‌గా మారింది. బాలీవుడ్‌లో తొలి చిత్రం విడుదల కాకముందే ఈ భామ ముంబయి ఫిల్మ్ సర్కిల్స్‌లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నది. అందుక్కారణం హీరో కార్తీక్ ఆర్యన్‌తో ఈ అమ్మడి లవ్ ఎఫైర్ గురించి విస్తృతంగా ప్రచారం అవుతున్న వార్తలే. బాలీవుడ్ అరంగేట్ర చిత్రంలో కార్తీక్ ఆర్యన్‌తో కలిసి నటిస్తున్నది శ్రీలీల. అనురాగ్‌బసు దర్శకుడు. ఈ చిత్రానికి 'ఆషికీ-3' అనే టైటిల్ పెట్టినట్లు వార్తలొచ్చాయి. అయితే కొన్ని లీగల్ ఇష్యూస్ కారణంగా ఆ టైటిల్‌కు అనుమతి లభించలేదని తెలిసింది. ఇదిలావుండగా ఈ సినిమా షూటింగ్ సమయంలోనే కార్తీక్ ఆర్యన్, శ్రీలీల ప్రేమలో పడ్డారని, కార్తీక్ ఆర్యన్ ఫ్యామిలీ పార్టీకి శ్రీలీలను ప్రత్యేకంగా ఆహ్వానించారని, ఈ జంట గుట్టుగా ప్రేమాయణం సాగిస్తున్నారని బాలీవుడ్ మీడియాలో కథనాలొచ్చాయి. 'ఓ డాక్టర్ మా ఇంటికి కోడలిగా రావాలనుకుంటున్నాం' అంటూ ఇటీవల ఓ అవార్డుల వేడుకలో కార్తీక్ ఆర్యన్ తల్లి వ్యాఖ్యానించడంతో ఈ జంట లవ్ ఎఫైర్‌కు మరింత బలం చేకూరినట్లయింది. కార్తీక్ ఆర్యన్-శ్రీలీల నటిస్తున్న సినిమా షూటింగ్ ప్రస్తుతం పశ్చిమబెంగాల్‌లోని సిలిగురిలో జరుగుతున్నది. అక్కడి కాఫీ తోటల్లో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీలీలతో కలిసి ఉన్న ఓ ఫొటోను కార్తీక్ ఆర్యన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీనికి 'తూ మేరీ జిందగీ' (నువ్వే నా ప్రపంచం) అంటూ సినిమాలోని ఓ పాట తాలూకు పల్లవిని క్యాప్షన్‌గా పెట్టారు. ఈ ఫొటోలో శ్రీలీల వైపు ఆరాధనాపూర్వకంగా చూస్తూ కనిపిస్తున్నారు కార్తీక్ ఆర్యన్. వారిద్దరి మధ్య కెమిస్ట్రీ ఎంత బలంగా ఉందో ఈ ఫొటో చూస్తే అర్థమవుతున్నదని, కార్తీక్ ఆర్యన్ తన మనసులోని మాటలు క్యాప్షన్ ద్వారా బయటపెట్టాడని నెటిజన్లు కామెంట్స్ చేస్తుండటం విశేషం. ఈ జంట ప్రేమ వ్యవహారంలో నిజమెంతుందో తెలియదు కానీ.. తొలి సినిమాతోనే బాలీవుడ్‌లో శ్రీలీల పేరు మార్మోగిపోతున్నదని ఫ్యాన్స్ అనుకుంటున్నారు.





## ఈ సినిమాతో నాకు అనుబంధం - ఎమ్మెల్యే మల్లారెడ్డి

కొన్నేళ్ల విరామం తర్వాత గాయకుడు ఎస్పీ చరణ్ నటుడిగా నటించిన చిత్రం 'లైఫ్' (లవ్ యువర్ ఫాదర్). పవన్ కేతరాజు దర్శకుడు. కిషోర్ రాఠీ, మహేష్ రాఠీ, రామస్వామిరెడ్డి నిర్మాతలు. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటించారు. ఏప్రిల్ 14న సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ 'ఈ సినిమాలో నటించిన యువజంట శ్రీహర్ష, కషిక కపూర్ చూడ ముచ్చటగా ఉన్నారు. శ్రీహర్ష మా కాలేజీ స్టూడెంట్. ఆయన తండ్రి మా కాలేజీ ప్రిన్సిపల్. కాబట్టి ఈ సినిమాతో నాకు మంచి అనుబంధం ఉన్నట్టే. అందుకే ఈ ఈవెంట్‌లో పాల్గొన్నాను. దర్శకుడు పవన్ కేతరాజు మంచి సినిమానే తీసుకుంటాడని నమ్ముతున్నా. సినిమా పెద్ద విజయం సాధించాలి.' అని శుభాకాంక్షలు అందించారు. ఎస్పీ చరణ్ ఈ సినిమా చేయబట్టే ఈ సినిమా ఇంతబాగా వచ్చిందని, ఎస్పీబాలుగారు చరణ్‌ని మనకు బహుమతిగా ఇచ్చారని, ఆయన నటించిన ప్రతి సన్నివేశాన్నీ ఎంజాయ్ చేశానని దర్శకుడు పవన్ కేతరాజు కొనియాడారు. తన పాత్రను డిజైన్ చేసిన దర్శకుడికి ఎస్పీ చరణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందులోని యువజంట శ్రీహర్ష, కషిక చాలా కష్టపడ్డారని, ఈ సినిమాతో వారికి తప్పక విజయం లభిస్తుందని ఎస్పీ చరణ్ ఆశాభావం వెలిబుచ్చారు. ఇంకా చిత్రయూనిట్ మొత్తం మాట్లాడారు. ప్రవీణ్, ఛత్రపత్రి శేఖర్, రఘుబాబు, భద్రం, షకలక శంకర్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె.నాయుడు, సంగీతం: మణిశర్మ.

## నాన్నది పోరాడే తత్వం



తన తండ్రి సైఫ్ అలీఖాన్‌పై కొన్ని రోజుల క్రితం జరిగిన దాడి గురించి రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో ఆయన కుమార్తె, నటి సారా అలీఖాన్ స్పందించింది. ఆ క్షణాలను ఆమె గుర్తు చేసుకుంటూ.. 'ఆ పదిహేను నిమిషాలు నన్ను అయోమయస్థితిలో పడేశాయి. ఏం జరుగుతుందో అర్థంకాలేదు. షాక్‌లో ఉండిపోయా. ఆసుపత్రికి చేరుకునేవరకూ ఫోన్‌కాల్స్ వస్తూనే ఉన్నాయి. చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి నాన్న చిరునవ్వుతో బయటికి రావడం చూసి ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నా. మేమంతా కంగారు పడకూడదనే నాన్న నిబ్బరంగా ఉన్నారు. నిజంగా చెప్పాలంటే ఆయనది పోరాడేతత్వం. కానీ నేను అలా కాదు.. ఊరకే ఏడ్చేస్తా. కంగారుపడిపోతా.' అంటూ భావోద్వేగానికి లోనయ్యింది సారా. జనవరి 16న అర్ధరాత్రి సమయంలో సైఫ్ అలీఖాన్ ఇంట్లోకి చొరబడిన దుండగుడు.. ఆయనపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసిందే. ఆ సంఘటనలో సైఫ్ అలీఖాన్ వెన్నెముకకు తీవ్రగాయమవ్వడంతో సర్జరీ చేశారు.

## లొకేషన్‌లో ఆయన్ని చూస్తే భయమేసింది

సన్నీడియోల్ కథానాయకుడిగా టాలీవుడ్ డైరెక్టర్ మలినేని గోపీచంద్ దర్శకత్వం వహించిన బాలీవుడ్ 'జాట్' చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈసినిమాలో నటి రెజీనా కసాండ్రా కీలక పాత్ర పోషిస్తున్నది. ఇటీవల ముంబయ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఇందులోని తన పాత్ర గురించి, 'జాట్' సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది రెజీనా. ' 'జాట్'లో నా పాత్ర పేరు భారతి. ఇలాంటి పాత్రను పోషించడం నా కెరీర్‌లో ప్రథమం. తెరపై నన్ను చూసి ఆశ్చర్యపోతారు. ఇదొక విభిన్నమైన కథ. ఒక్క రాత్రిలో జరిగే పెను విస్ఫోటనం అని చెప్పొచ్చు. సన్నీ డియోల్ నట విశ్వరూపం చూస్తారు. లొకేషన్‌లో ఆయన పెర్‌ఫార్మెన్స్ చూసి నిజంగా భయమేసింది. ఇక ఆడియన్ ఎలా ఫీలవుతారో అర్థం చేసుకోండి. దేవుడు దిగి వస్తే.. అన్నట్టుగా ఉంటుంది ఆయన పాత్ర. ఇంత కంటే ఈసినిమా గురించి చెప్పకూడదు. డైరెక్టర్ మలినేని గోపీచంద్‌కి బాలీవుడ్‌లో పెద్ద బ్రేక్ ఈ సినిమా.' అని చెప్పింది రెజీనా.




